

ఈద్గాహ్‌లో ప్రార్థన చేస్తున్న ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కర్బలా మైదానంలో నమాజులో పాల్గొన్న పెదబాబు

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



నమాజులో పాల్గొన్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక నమాజులు చేశారు. మత పెద్దలు విశేష ప్రార్థనలు చేసి ఖురాన్ బోధనలు విని పించారు. ఖురాన్ సూచించిన మార్గంలో పయనించి శాంతి స్థాపనకు కృషి చేయాలని సూచించారు. సర్వమత సమానత్వాన్ని పాటించాలన్నారు. ముస్లింలు ఒకరిని ఒకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానాలు చేసి గృహాలకు చేరుకున్నారు. తమ నివాసాల్లో బంధుమిత్రులకు విందు ఇచ్చారు. వంగాయగూడెం రోడ్డులోని ఈద్గాహ్ ప్రాంగణంలో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్, పాత బస్టాండు వద్ద కర్బలా మైదానంలో నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో, లక్ష్మీవారపు పేటలోని అహలే హదీస్, ఉమర్ ఏ ఫరూఖ్, మర్కజ్ ఈనామ్, తంగెళ్లమూడిలోని నెహర్, రాణీ నగర్‌లోని పురానా, నయా, జామియా, చౌక్, ఖురేషీ, నాథూమియా, మదీనా, అక్కిరెడ్డి, ఎంఎం కాలనీ, మాదేపల్లి, గేట్, జుమీరాత్, బీడీ కాలనీ, ఇస్లాంపేట, ఫాతిమా, జిల్లా, శనివారపుపేట, దొండపాడు, మహ్మదీయ, వైఎస్సార్ కాలనీ, తబ్లిక్ జమాత్, నూర్ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కర్బలా మైదానంలో జరిగిన ప్రార్థనల్లో అంజుమన్ సంస్థ ప్రతినిధులు ఎండీ సులేమాన్, రాజా అహ్మద్, అంజాద్ షరీఫ్, ఎండీ ఎగ్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడమే

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే రంజాన్ నినాదమని ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. పడమర వీధి పాలతూము సెంటర్‌లో ఉన్న మసీదులో ఉదయం నమాజులో, కర్బలా మైదానంలో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమంలో పెదబాబు పాల్గొన్నారు. ముస్లింలను ఆదరించిన హిందూ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరిపై అల్లా కరుణా కటాక్షాలు కురవాలని ఆకాంక్షించారు.



ఖురాన్ బోధనలు వినిపిస్తున్న ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్

క్లుప్తంగా

పెరిగిన రెమ్యూనరేషన్ చెల్లించాలని వినతి



డీఈఓకు వినతి పత్రం అందిస్తున్న డెమోక్రటిక్ పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో 10వ తరగతి జవాబుపత్రాల మూల్యాంకన విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు ఇటీవల రెమ్యూనరేషన్ పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్‌ను కోరారు. ఈ మేరకు పదో తరగతి మూల్యాంకన పర్యవేక్షణలో ఉన్న డీఈఓను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ముగిసిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా పెరిగిన రెమ్యూనరేషన్‌ను వర్తింపజేసి చెల్లించాలని కోరారు. రెమ్యూనరేషన్ చెల్లించడానికి తగిన చర్యలు తీసుకుంటామని డీఈఓ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, నాయకులు సీహెచ్ పెద్దిరాజు, బి.రవి కుమార్, డి.కరుణ కుమారి, వి.గంగాధర్ తదితరులున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుని, దేవేరులను పెండ్లి కుమార్తెలను చేశారు. స్వామివారి మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేశారు. సాయంత్రం విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచన, రక్షా బంధన, రుత్విక్వరుణ పూజలు నిర్వహించారు. మృత్సంగ్రహణ, అంకురార్పణ, వాస్తు హోమం, వాస్తు పర్యగ్నీకరణ, యాగశాల ప్రవేశం, వైనతేయ ధ్వజాధివాసం నిర్వహించి మంగళాశాసనాలు పలికి తీర్థప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా, ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మిగులు భూములు పేదలకు పంచాలి



అభివాదం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పేదలు

ఏలూరు (టూటౌన్) : దెందులూరు మండలం దోసపాడుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న 72 ఎకరాల భూమి మినహాయించి మిగిలిన 150 ఎకరాల భూమిని వెంటనే పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను తప్పు దోవ పట్టిస్తున్న దెందులూరు తహసీల్దార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 144, 145 సెక్షన్ పెట్టి పేదలను, దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇప్పటికే పట్టాదారుల పేర్లు, వారి వారసుల పేర్లు ఇచ్చినా ఇవ్వలేదని మరలా ఇవ్వాలంటూ తహసీల్దార్ మాటమార్చడం సిగ్గుచేటన్నారు. చట్టాలను అమలు చేసే అధికారులనే దెందులూరు మండలానికి కేటాయించాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అసైన్డ్ యాక్ట్ ప్రకారం వ్యవసాయ భూముల్లో చేపలు, రొయ్యలు చెరువులు తవ్వకూడదని ఉన్నా దాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. చట్టాలను అమలు చేయాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు భూస్వాముల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ చేపల చెరువుల వద్ద ఉన్న భూస్వాముల ఏజెంట్లను, బినామీలను వెంటనే అక్కడి నుండి తొలగించాలని కోరారు. దోసపాడు పేదలకు న్యాయం చేయని పక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సీహెచ్ భూషణం, జి.తేరేజమ్మ, సీహెచ్ ఏసుమణి, సీహెచ్ దేవకృప తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ లెనిన్‌కు ఘన నివాళి



సీపీఎం కార్యాలయంలో లెనిన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమం

ఏలూరు (టూటౌన్): సమసమాజ నిర్మాణానికి మార్క్స్, ఏంగెల్స్‌లు సిద్ధాంత పునాదివేస్తే, ఆ సిద్ధాంతాన్ని ఆచరణ సాధ్యం చేసిన విప్లవ సారథి లెనిన్ అని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యుడు గుడిపాటి నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ 153వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రష్యా విప్లవాన్ని విజయవంతం చేసిన విప్లవ యోధుడు లెనిన్ అని గుర్తుచేశారు. నాయకులు పి.రామకృష్ణ, పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, ఎం.ఇస్హాక్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తి

కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకు పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు పిలుపునిచ్చారు. లెనిన్ జయంతి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చిట్టివలసపాకల్లోని న్యూడెమోక్రసీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. రష్యాలో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కార్మిక రాజ్యాన్ని స్థాపించిన లెనిన్ బాట అనుసరణీయమన్నారు. నాయకులు కాకర్ల అప్పారావు, యర్రా శ్రీనివాసరావు, మంగం అప్పారావు, ఎస్.నెహ్రూబాబు, రంగాల సూకరాజు, ఇఫ్టూ నాయకులు గడసాల వెంకటరమణ, సందక అప్పారావు, రాచీటి జాన్, కె.చిట్టియ్య పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



కోలాట బృందం చిన్నారులను సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చనచేశారు. విష్ణు సహస్ర నామ పారాయణ చేసి గోవిందనామస్మరణ, భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. స్వామి ఉత్సవాల్లో కోలాట ప్రదర్శనలతో ఆధ్యాత్మిక భావాలు పంచుతున్న కోలాట గురువులు కీర్తి శ్రీను, మారిశెట్టి ప్రభావతి, ఉగ్గిన భవానీలను ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కోలాట బృందంలోని చిన్నారులను కండువాలు, జ్ఞాపికలతో సత్కరించి దాండియా స్టిక్స్ బహూకరించారు. ఆలయ అర్చకులు కోట సత్య ప్రకాశాచార్యులు పూజలు చేశారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



బిషప్ జయరావును సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ సమాజ సేవాకు సంసిద్ధులు కావాలని ఏలూరు బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. జె అండ్ జె కరుణోదయ మానసిక దివ్యాంగుల విద్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. విద్యాసంస్థ ప్రాంగణంలోని మథర్ థెరిస్సా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యాలయం ఆవరణలో మొక్క నాటారు. పాఠశాల కార్యక్రమాలు, బోధన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కరుణోదయ సంస్థ ద్వారా ఏలూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉన్న మానసిక దివ్యాంగులైన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నందుకు సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. దివ్యాంగులైన పిల్లలకు సేవ చేయడం అద్భుత సమాజ సేవగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జయరావుకు కరుణోదయ సంస్థ ఫౌండర్, చైర్మన్ కలతోటి డోమినిక్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యులు మేతర అజయ్ బాబు, వంగూరు సర్పంచ్ రుత జోసెఫ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పు తీర్చాలంటూ వ్యక్తిపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాద ప్రాంతానికి చెందిన వ్యక్తిని అప్పు తీర్చాలంటూ మరో వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు పత్తేబాద బృందం పార్కు సమీపంలో నివాసం ఉంటున్న జి.వెంకన్న అనే వ్యక్తి పందులు పెంచి, విక్రయిస్తూ ఉంటాడు. కుటుంబ అవసరాలు నిమిత్తం వడ్డీ వ్యాపారి కె.ప్రకాష్ వద్ద కొంతకాలం క్రితం రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు తీర్చే క్రమంలో ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. అప్పు తీర్చేసినా ఇంకా కట్టాలంటూ వడ్డీ వ్యాపారి బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేది రాత్రి అశోక్‌నగర్ మిలటరీ క్యాంటీన్ సమీపంలో పందులను తోలుకొచ్చేందుకు వెళ్లగా అక్కడకు వచ్చిన ప్రకాష్ బీరు సీసాతో తన పొట్టలో పొడిచి గాయపరిచి పారిపోయాడని బాధితుడు వెంకన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. గాయాలుపాలైన అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అతను ప్రస్తుతం వైద్య చికిత్స పొందుతున్నారు.

రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం కొనుగోలులో రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని, రవాణా ఇబ్బందులు లేకుండా సరిపడే లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

ప్రస్తుత రబీలో ఎకరాకు 75 కిలోల ధాన్యం బస్తాలు 50 నుంచి 60 వరకు దిగుబడి వచ్చిందని, ఈ లెక్కన రైతులకు ఎకరాకు 100 సంచులు అవసరం అవుతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎకరాకు మొదటి 75 సంచులను ఇచ్చారని రైతులు ఆందోళన చేయడంతో 92 సంచులను ఇస్తున్నారని పేర్కొన్నారు. పంటలో 60 శాతం కొనుగోలు చేయాలని లక్ష్యం విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రవి కోరారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు



లాడ్జి యజమానులతో మాట్లాడుతున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలోని లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో శనివారం రాత్రి వన్‌టౌన్ స్టేషన్‌లో లాడ్జిల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. వన్‌టౌన్‌లోని ప్రతి లాడ్జిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లాడ్జిల్లో పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు యాజమాన్యంపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లాడ్జిల్లో ఎక్కువ రోజులు బస చేసే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. లాడ్జిలకు వచ్చే వారి వివరాలు విధిగా సేకరించి రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులకు లాడ్జిల్లో బస చేసేందుకు అనుమతి ఇవ్వకూడదని, అసాంఘిక శక్తులు చొరబడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఏలూరు వన్‌టౌన్ ఎస్సై ఎస్.రామకృష్ణ, ఏలూరు రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు ఉన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి

దెందులూరు: సానిగూడెంలో మూడు గ్రామాలకు చెందిన 40 కుటుంబాల ముస్లిం సోదరుల శ్మశానికి వెళ్లే కల్వర్టు నిర్మాణ పనులు శనివారం పూర్తయ్యింది. గంగన్నగూడెం, గాలాయగూడెం, సానిగూడెంకు చెందిన ముస్లిం సోదరులు ఇటీవల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసి మరణానంతరం అంత్యక్రియలకు రోడ్డు నుంచి శ్మశానానికి వెళ్లడానికి పటిష్టమైన దారి బోదెపై కల్వర్టు లేదని తెలియజేయడంతో వెంటనే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నిధులు మంజూరు చేసి సానిగూడెం సర్పంచ్ శనపల్లి విష్ణును నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కల్వర్టును యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేశారు. ఈ కల్వర్టు వల్ల మూడు గ్రామాల ముస్లిం సోదరులకు శాశ్వత ప్రయోజనం చేకూరింది. కల్వర్టు పనులను గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ముస్లిం పెద్దలు పరిశీలించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నానికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	42
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	16	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	60
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	11
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33